అరటి సాగు.. లాభాలు బాగు

- సాగుకు రైతుల ఆసక్తి
- విదేశాలకు ఎగుమతి అవుతున్న అరటి
- ఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- ప్రోత్సహిస్తున్న ఉద్యానశాఖ


పీఆర్ పల్లిలో సాగవుతున్న అరటి


ఊటకొండలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారిణి

ప్యాపిలి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉద్యాన పంటలు సాగు చేయాలనుకుంటున్న రైతులు ముందుగా అరటికే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇతర పంటలతో పోలిస్తే పెట్టుబడి వ్యయం అరటిలో ఎక్కువే అయినా వాతావరణ పరిస్థితులు అన్నీ అనుకూలిస్తే లాభాలు కూడా బాగానే ఉంటున్నాయి. ఈ ఏడాది మామిడిలో ఆశించిన దిగుబడి లేకపోవడంతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇదే తరుణంలో గత నాలుగు నెలల క్రితం అరటి రైతులు లక్షల్లో లాభాలను ఆర్జించారు. దీంతో ఇతర పంటలు సాగు చేసి నష్టపోయేకంటే లాభాలు గ్యారెంటీగా ఉన్న అరటి సాగు చేయడం మంచిదన్న అభిప్రాయం రైతుల్లో నెలకొంది.

విదేశాలకు ప్యాపిలి అరటి

ప్యాపిలి మండలంలో అరటి రైతులు జీ–9 రకాన్ని సాగు చేస్తున్నారు. కాయల సైజు పెద్దగా రావడంతో పాటు కాయ నాణ్యతగా ఉండేందుకు, కాయలో పోషక విలువలు బాగా ఉండేందుకు ఫ్రూట్ కేర్ యాక్టివిటీ పద్ధతిలో సాగు చేస్తున్నారు. ఈ తరహా సాగులో పాటించాల్సిన మెళకువలను ఉద్యానశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. జీ–9 రకం అరటికి అరబ్ దేశాలైన సౌదీ అరేబియా, దుబాయ్, ఇరాన్, ఇరాక్ తదితర దేశాల్లో మంచి డిమాండ్ ఉంది. గత జనవరి, ఫిబ్రవరి నెలల్లో మహారాష్ట్రకు చెందిన వ్యాపారులు ఇక్కడి అరటిని నాణ్యతను బట్టి టన్ను రూ. 25 వేల నుంచి రూ. 27 వేల వరకు కొనుగోలు చేశారు. విదేశీ మార్కెట్‌లో టన్ను అరటి రూ. 60 వేలు పలికుతున్నట్లు సమాచారం.

రెండో కోత నుంచి లాభాల బాట

అరటి తోటలు సాగు చేయాలంటే ఎకరాకు రూ. లక్ష నుంచి రూ. 1.5 లక్షల వరకు పెట్టుబడి కింద ఖర్చు చేయాల్సి ఉంటుంది. మొక్కలను నాటిన తర్వాత ఏడాదికి మొదటి కోత వస్తుంది. కాయ నాణ్యత, ధర ఆశాజనకంగా ఉంటే మొదటి కోతలోనే పెట్టుబడి ఖర్చులు పోను లాభాలు వస్తాయి. రెండో కోతలోనూ నిర్వహణ ఖర్చులు పోను లాభం గ్యారెంటీగా వస్తుంది. కొద్ది శాతం మంది రైతులు మాత్రమే మూడో కోతను కూడా తీసి లాభాలను అర్జిస్తున్నారు.

ఈ ఏడాది 2500 ఎకరాల్లో అరటి సాగు

ప్యాపిలి మండలం బోయవాండ్లపల్లి, నల్లమేకలపల్లి, డి.రంగాపురం, రాంపురం, రాచవాండ్లపల్లి, జక్కసానికుంట్ల, పెద్దపాయి, వెంకటకొండాపురం, పీఆర్ పల్లి, గుడిపాడు, చంద్రపల్లి, హుసేనాపురం, జలదుర్గం, బావిపల్లి, ఊటకొండ, గోపాలనగరం, ఎస్ రంగాపురం, మెట్టుపల్లి తదితర గ్రామాల్లో అధిక శాతం మంది రైతులు అరటి సాగు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో గత ఏడాది 1500 ఎకరాల్లో సాగైన అరటి ఈ ఏడాది 2,500 ఎకరాల్లో సాగు కావచ్చని ఉద్యానశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గత మార్చి నుంచి అరటి మొక్కలు నాటుకోవడం ప్రారంభించారు. జూన్ నెలాఖరు వరకు అరటి సాగుకు సమయం అనువుగా ఉంటుంది. దీంతో రైతులు అరటి మొక్కలు నాటడంలో బిజీగా ఉన్నారు.

కొత్తగా సాగు చేస్తున్నా


గతంలో వేరుశనగతో పాటు పలు రకాల పంటలను సాగు చేశాను. అయితే ఏదో ఒక రూపంలో నష్టాలు తప్పడం లేదు. అరటిలో మంచి లాభాలు ఉంటాయని భావించి ఈ ఏడాది ఐదు ఎకరాల్లో అరటి సాగు చేస్తున్నాను. కొద్ది రోజుల క్రితమే మొక్కలు నాటాను. పెట్టుబడి ఖర్చులు పోను లాభాలు వస్తాయన్న నమ్మకంతో అరటి సాగు చేస్తున్నాను. –కొండా రాజు, గుడిపాడు.

రైతులు ఆసక్తి చూపుతున్నారు


కొన్నేళ్లుగా ప్యాపిలి మండలంలో అరటి తోటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. జీ–9 రకం అరటికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు వచ్చి రైతుల దగ్గర అరటి కొనుగోలు చేసి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. దీంతో కొత్త రైతులు కూడా అరటిని సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు. ఉద్యాన శాఖ ద్వారా రైతులకు అవసరమైన సలహాలు ఇస్తున్నాం. –కళ్యాణి, ఉద్యానశాఖ అధికారిణి

క్లుప్తంగా

రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు


డీలర్లతో సమీక్షిస్తున్న తహసీల్దార్

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో వచ్చే నెల 1వ తేదీ నుంచి చౌకదుకాణాల్లో రేషన్ పంపిణీని పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని చౌకదుకాణ డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్డుదారులకు బియ్యం, చక్కెర, తదితర నిత్యావసర సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. తూకాల్లో మోసాలు లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం పంపిణీ జరగాలని పేర్కొన్నారు. సీఎస్ డీటీ నాగేశ్వరరెడ్డి, ఆర్ఐ రంజిత్, సీనియర్ అసిస్టెంట్ పుల్లయ్య పాల్గొన్నారు.

కూర్మ జయంతి ఆహ్వానపత్రికల ఆవిష్కరణ


ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న ధార్మిక సంస్థల ప్రతినిధులు

బేతంచెర్ల: ఆస్పరి మండలంలోని నల్లగుట్ట కూర్మ క్షేత్రంలో జూన్ 7న కూర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, సమరసత సేవా ఫౌండేషన్ డివిజన్ కన్వీనర్ నాగమోహన్ అన్నారు. ఈ మేరకు బేతంచెర్ల పూదోట మఠంలో జయంతి వేడుకల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. కూర్మ క్షేత్ర నిర్వాహకుడు నరేష్, ధార్మిక సంఘాల సభ్యులు మారుతి కృష్ణ, గుండా గోపాలు, గూని నాగరాజు, రామూర్తి పాల్గొన్నారు.

సింధూర్‌ను పాఠ్యాంశంగా చేర్చాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

డోన్ టౌన్: ఉగ్రస్థావరాలు, పాకిస్తాన్‌పై భారతదేశ సైనికులు నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ విజయాంశాలను పాఠ్యాంశాలుగా చేర్చాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సందు వెంకటరమణ విజ్ఞప్తి చేసారు. మంగళవారం తహసీల్దార్ నాగమణిని కలిసి వినతి పత్రం అందజేశారు. నాయకులు కిరణ్, బద్రీ సుధాకర్, విజయభాస్కర్, శశివర్ధన్ ఉన్నారు.

నివాళి


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె: నంద్యాల మండలం తోగర్చేడు గ్రామానికి చెందిన శివారెడ్డి క్యాన్సర్‌తో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మంగళవారం గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు ఉన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి


హుసేనాపురం రైతు సంఘం నూతన కమిటీ

బేతంచెర్ల: ఖరీఫ్ ప్రారంభానికి ముందు నుంచే వర్షాలు కురుస్తున్నాయని.. ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో మండల కార్యదర్శి రామ్మోహన్ ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు.

అనంతరం హుసేనాపురం గ్రామ అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటేశ్వర్‌రెడ్డి, రామ చంద్రుడు, ఉపాధ్యక్షులు చంద్రారెడ్డి, సహాయ కార్యదర్శిగా కృష్ణారెడ్డి, కమిటీ సభ్యులుగా నారాయణ, నాగన్న, స్వామిరెడ్డి, సుబ్బరాయుడులను ప్రకటించారు.

రహదారిపై మట్టికుప్పల పరిశీలన


రహదారిపై అడ్డుగా ఉన్న మట్టికుప్పలను పరిశీలిస్తున్న ఆర్డీఓ

కోవెలకుంట్ల: మండలంలోని కంపమల్ల గ్రామంలో కాల్వ పేరుతో తవ్వకాలు జరిపి రహదారిపైనే మట్టికుప్పలు వేయగా రాకపోకలు నిలిచిపోవడంతో మంగళవారం డోన్ ఆర్డీఓ నరసింహులు గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోని బీసీ కాలనీ ప్రజలపై గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు రాజకీయ కక్ష సాధిస్తున్నారు. కాలనీలో 75 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఎక్కువశాతం వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులున్నారనే దురుద్దేశంతో రహదారి కష్టాలు తెచ్చిపెట్టారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో రూ. 1.30 లక్షల గ్రామ పంచాయతీ నిధులు వెచ్చించి 150 మీటర్ల మేర కాలనీలో డ్రెయినేజీ ఏర్పాటు చేశారు. ఈ రహదారి వెంటే గ్రామానికి చెందిన రైతులు, కాలనీ ప్రజలు పొలాలు, ఊరకుంట, మెయిన్‌రోడ్డుకు వెళుతున్నారు. డ్రెయినేజీ ఉన్నా ఏడు నెలల క్రితం టీడీపీ నాయకులు ఆ డ్రెయిన్ పక్కనే ప్రొక్లెయిన్‌తో కాల్వ పేరుతో తవ్వకాలు చేపట్టారు. తవ్విన మట్టిని రోడ్డుపైనే కుప్పలుగా పోయడంతో రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గ్రామస్తులు జిల్లా కలెక్టర్ రాజకుమారికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆర్డీఓతోపాటు తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ వరప్రసాదరావు రహదారిని పరిశీలించారు. బీసీ కాలనీవాసులు వెళ్లేందుకు రోడ్డు లేదని అధికారులు ఆర్డీఓ దృష్టికి తెచ్చారు. బీసీ కాలనీ పక్కనే మరో మూడు వీధులు ఉండగా ఆ ప్రాంతంలో కాల్వ తవ్వకుండా తమపై మాత్రమే కక్షకట్టారని కాలనీవాసులు ఆర్డీఓ దృష్టికి తెచ్చారు. రోడ్డుపై అడ్డుగా ఉన్న మట్టికుప్పలు తొలగించి రహదారిని క్లియర్ చేయాలని ఆర్డీఓ అధికారులను ఆదేశించారు.

ఘనంగా అమావాస్య పూజలు


గాడుబావి వీరాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


అభయాంజనేయుడు



బేతంచెర్ల: పట్టణంలోని బైటిపేటలో వెలసిన గాడుబావి వీరాంజనేయస్వామి, గొరిపేటలోని ఆంజనేయస్వామి, పలక చింతమాను, కనుమ ఆంజనేయ స్వామి ఆలయాల్లో మంగళవారం వైశాఖ మాస అమవాస్య పూజలు జరిగాయి. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, సింధూర అర్చన, ఆకు పూజ, మహామంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. అలాగూ బనగానపల్లె రహదారిలోని పుట్టపెద్దమ్మ, సిమెంట్ నగర్ గ్రామంలోని సుంకులా పరమేశ్వరి ఆలయాల్లో విశేష పూజలు చేశారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

డోన్ టౌన్: వైశాఖ మాసం కృష్ణ పక్షం అమావాస్యను పురస్కరించుకుని మండలంలోని గుమ్మకొండ సమీప కొండలో వెలసిన బంగారుకొండ పాత పాలెం అభయాంజనేయస్వామికి మంగళవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాల పూజలతో పాటు పంచామృతాభిషేకాలు, తమల పాకుల తోరణాలు, సింధూర, కుంకుమార్చనలు తదితర ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం మహా నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి ఇచ్చారు.

అఖండ జ్యోతితో అయోధ్యకు పాదయాత్ర


పాదయాత్ర చేస్తున్న సాయిలేఖ్ రాం

ప్యాపిలి: సనాతన ధర్మ పరిరక్షణ బాధ్యత ప్రతి హిందువుపై ఉందని హర్యాణ రాష్ట్రానికి చెందిన రామభక్తుడు సాయిలేఖ్ రాం అన్నారు. మార్చి 22వ తేదీ కన్యాకుమారి నుంచి అయోధ్యకు అఖండ జ్యోతితో ఆయన చేపట్టిన పాదయాత్ర మంగళవారం ప్యాపిలికి చేరుకుంది. తాను ప్రత్యేకంగా తయారు చేసుకున్న ఓ వాహనంపై అఖండ జ్యోతిని వెలిగించి ఈ యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ 22 కిలోమీటర్ల చొప్పున చేపడుతున్న పాదయాత్ర ద్వారా మరో ఆరు నెలల్లో అయోధ్య రామాలయానికి చేరుకుంటానని చెప్పారు. కన్యాకుమారి నుంచి మార్గమధ్యలో రామేశ్వరం చేరుకుని.. అక్కడి నుంచి అయోధ్యకు యాత్ర చేపట్టినట్లు తెలిపారు. సనాతన ధర్మ పరిరక్షణ గురించి ప్రచారం చేస్తూ ఈ యాత్ర చేస్తున్నానని వివరించారు.

రైలు ప్రయాణికుల పాట్లు

- కిక్కిరిస్తున్న నంద్యాల–రేణిగుంట రైలు
- అదనపు బోగీల కోసం ఎదురుచూపు


నంద్యాల నుంచి రేణిగుంట డెమో రైలు

బనగానపల్లె: నంద్యాల నుంచి రేణిగుంటకు వెళ్లే డెమో రైలుకు అదనపు బోగీలు ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రయాణికులు కోరుతున్నారు. తిరుమల వెంకన్న స్వామి దర్శనం కోసం వెళ్లే ప్రయాణికులకు ఈ రైలు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఏడు బోగీలతో ప్రతి రోజు ఉదయం 6 గంటలకు నంద్యాల నుంచి బయల్దేరి రేణిగుంటకు మధ్యాహ్నం 12.45కు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 1.30 గంటలకు బయలుదేరి రాత్రి 8 గంటలకు నంద్యాలకు చేరుకుంటుంది. ఈ రైలు నంద్యాల నుంచి మద్దూరు, బనగానపల్లె, కోవెలకుంట్ల, సంజామల, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, కడప, రాజంపేటతో పాటు ప్రతి చిన్న రైల్వేస్టేషన్‌లోనూ అగుతూ ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది. 2016 ఆగస్టులో డెమో రైలు ప్రయాణ సౌకర్యాన్ని నంద్యాల నుంచి కడప వరకు అధికారులు కల్పించారు. ఆ తరువాత కడప సమీపంలోని పెండ్లిమర్రి వరకు పొడిగించారు. కొంత కాలం తర్వాత రేణిగుంట వరకు పొడిగించారు. ఆర్టీసీ బస్సు టికెట్ కన్నా డెమో రైలులో టికెట్ చాలా తక్కువగా ఉండి తక్కువ సమయంలోనే రేణిగుంట చేరుతున్నందున రైలు ప్రయాణానికే ప్రయాణికులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. నంద్యాల నుంచి రేణిగుంటకు టిక్కెట్ రూ.60 ఉండగా బస్సులో రూ.500 ఉంది. ముఖ్యంగా నంద్యాల నుంచి రాజంపేట వరకు ఇంటర్, బీటెక్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రతి రైల్వేస్టేషన్ నుంచి 70–80 మంది ప్రయాణికులు ఈ రైల్‌లో ప్రయాణిస్తున్నారు. కొంత కాలంగా నంద్యాల ప్రారంభంలోనే ప్రయాణికులతో ఈ రైల్ కిక్కిరిసి ఉంటుంది. నంద్యాల నుంచి ప్రొద్దుటూరు వరకు అన్ని విధాలుగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో పారిశ్రామికవేత్తలకు కూడా ఈ ప్రయాణం ఎంతో అవసరంగా ఉంది. ప్రస్తుతం ఉన్న బోగిలు చాలకపోవడంతో ప్రయాణికులు నిలబడి ప్రయాణించాల్సిన పరిస్థితి. రైల్వే ఉన్నతాధికారులు సమస్యను గుర్తించి అదనపు బోగీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

ప్యాపిలి: మండల పరిధిలోని ఎస్ రాచర్ల గ్రామంలో జూన్ 1వ తేదీ న్యూ క్యాటగిరి విభాగంలో రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమత్సమేత సీతారామ లక్ష్మణ స్వాముల విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు వరుసగా రూ.80 వేలు, రూ.60 వేలు, రూ. 40 వేలు, రూ. 30 వేలు, రూ. 20 వేలు, రూ. 15వేలు, రూ. 10 వేలు చొప్పున అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు 95730 82338, 99086 14220 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఇంటి పన్నుల పెంపు జీఓ దగ్ధం


జీఓను దగ్ధం చేసి నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

డోన్ టౌన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలపై అదనపు భారం మోపడం కూటమి ప్రభుత్వ మోసానికి నిదర్శనం అని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, నాయకులు శివరామ్, భాస్కర్‌రెడ్డి, చిన్న రహిమాన్ ఆరోపించారు. స్థానిక బేతంచెర్ల సర్కిల్‌లో మంగళవారం నిరసన తెలిపారు. ఇంటి పన్నులు 20 శాతం పెంచుతూ విడుదల చేసిన జీఓను దగ్ధం చేశారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు గత ప్రభుత్వ హయాంలో 15శాతం పెంచిన ఇంటి పన్నులను రద్దు చేస్తామని చెప్పి నేడు మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలోని ప్రజలపై ఏకంగా 20 శాతం ఇంటి పన్ను పెంపుదల జీఓను విడుదల చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఇంటి పన్ను పెంచేందుకు ప్రభుత్వం చేపడుతున్న రీసర్వేను ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

మూడు మండలాలకు ఒకే ఒక్కడు!


బనగానపల్లె వెలుగు కార్యాలయం

- రెగ్యులర్ ఏపీఎం లేక ఇబ్బందులు

బనగానపల్లె డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయానికి కొంత కాలంగా రెగ్యులర్ ఏపీఎం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లాలోనే అతిపెద్ద మండలంగా ఉన్న బనగానపల్లె వెలుగు కార్యాలయంలో పనిచేసే ఏపీఎం అడ్డాకుల శ్రీనివాసులుపై పలు ఆరోపణలు రావడంతో కొంత కాలం క్రితం సస్పెండ్ అయ్యారు. అవుకు మండల వెలుగు ఏపీఎం చంద్రశేఖర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఆయన అప్పటికే కొలిమిగుండ్ల మండల ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. దీంతో ప్రస్తుతం మూడు మండలాలకు ఒకే అధికారి ఉన్నారు. బనగానపల్లె మండలంలో 2,600 పొదుపు సంఘులు ఉండగా 28వేల మంది సభ్యులు ఉన్నారు. సభ్యులకు బ్యాంక్ రుణాలు ఇప్పించడంలో రెగ్యులర్ ఏపీఎం లేక జాప్యం జరుగుతున్నట్లు సమాచారం. స్త్రీనిధి రుణాల వసుళ్లలోనూ ఆలస్యం జరుగుతోంది. రెగ్యులర్ అధికారి లేకపోవడం వల్ల పలు ఇబ్బందులు ఎదురువుతున్నట్లు పొదుపు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.

–బనగానపల్లె

యోగాతో మానసిక ఒత్తిడి దూరం


మాట్లాడుతున్న ఆయుర్వేద వైద్యశాల చీఫ్ మెడికల్ ఆఫీసర్ వాణి


మాట్లాడుతున్న ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్


ఉద్యోగులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ


ప్యాపిలి: యోగాసనాలు వేస్తున్న కార్యాలయ సిబ్బంది

బనగానపల్లె రూరల్: ప్రతి రోజు యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడి నుంచి బయటపడవచ్చని బనగానపల్లె ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల చీఫ్ మెడికల్ ఆఫీసర్ వాణి అన్నారు. మంగళవారం స్థానిక పొదుపు భవనంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ యోగాకు కొంత సమయం కేటాయించాలని సూచించారు. యోగా మాస్టర్ తిరుమలయ్య అధికారులు, ఉద్యోగులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సతీష్‌కుమార్‌రెడ్డి సీనియర్ అసిస్టెంట్ హనీఫ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ లలిత ఆధ్వర్యంలో యోగా వల్ల కలిగే ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. జూన్ 21న జరిగే ప్రపంచ యోగాడే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులందరూ కృషి చేయాలని ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. మంగళవారం స్థానిక పొదుపు భవనంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందికి యోగాంధ్ర కార్యక్రమం పై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో యోగా కార్యక్రమంలో పాల్గొనే వారి పేర్లను నమోదు చేయాలని, మండలానికి 25 వేల మంది రిజిస్ట్రేషన్ చేయాలని ప్రభుత్వం టార్గెట్ విధించిందని తెలిపారు.

యోగాతో మానసిక ప్రశాంతత

బేతంచెర్ల: యోగాతో మానసిక ప్రశాంతత, ఆరోగ్యకరమైన జీవన విధానం కొనసాగించవచ్చని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ఎంఈఓ సోమశేఖర్, నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులకు యోగాపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమ దినచర్యలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు యోగా చేయడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించాలన్నారు.

యోగాంధ్రాను విజయవంతం చేయాలి

సంజామల: యోగాతో కలిగే ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీడీఓ సాల్మన్ అన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బందితో ఎంపీడీఓ సాల్మన్ సమావేశం నిర్వహించారు. జూన్ 21న యోగా సందర్భంగా ప్రతి పంచాయతీలో యోగాసనాల కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. అనంతరం సిబ్బందితో యోగాసనాలు చేయించారు. మండల పరిపాలన అధికారి విజయకుమార్ రెడ్డి, ఎంఈఓ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ప్యాపిలి: క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ భారతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం యోగాపై అవగాహన కల్పించారు. యోగా చేయడం ద్వారా శరీరం ఆరోగ్యంగా ఉండడంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందని తెలిపారు. పని ఒత్తిడిని జయించే దివ్య ఔషధంలా యోగా పని చేస్తుందన్నారు. అనంతరం సచివాలయ సిబ్బంది, తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి యోగా మాస్టర్ ద్వారా యోగాసనాలపై అవగాహన కల్పించారు.

అధ్వానంగా రోడ్లు


తవిసికొండ వద్ద రాళ్లుతేలిన రోడ్డు


బలపాలపల్లె వద్ద దెబ్బతిన్న రహదారి

బేతంచెర్ల: మండల పరిధిలోని బలపాలపల్లె, పాపసాని కొట్టాల, తవిసికొండ గ్రామాల రోడ్లు అధ్వానంగా మారాయి. రాళ్లుతేలి గుంతలమయమైంది. పదేళ్ల క్రితం వేసిన ఈ రహదారి మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఏడాదిగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి దెబ్బతిన్న రహదారికి మరమ్మతులు చేపట్టి సౌకర్యంగా మార్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మూతపడ్డ మినరల్‌వాటర్ ప్లాంట్


పనిచేయని మిషనరీ

పనిచేయని మినరల్ వాటర్ ప్లాంట్

- తప్పని తాగునీటి ఇక్కట్లు

కోవెలకుంట్ల: మండలంలోని అమడాల మెట్ట వద్ద ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్ 20 రోజుల నుంచి పనిచేయడం లేదు. నీటిని ఫిల్టర్ చేసే మిషనరీ దెబ్బతినడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. ప్లాంట్ మూతపడడంతో వివిధ గ్రామాల ప్రజలకు తాగునీటి ఇక్కట్లు తప్పడం లేదు. మెట్ట జడలయ్యస్వామి ఆశ్రమం వద్ద నిత్యాన్నదానం కొనసాగుతోంది. కోవెలకుంట్ల–బనగానపల్లె ఆర్అండ్‌బీ రహదారిలో ప్రతి రోజు వంద సంఖ్యలో లారీలు, కార్లు, ఆటోలు, తదితర వాహనాల్లో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. వీరంతా ఆశ్రమం వద్ద ఆగి భోజనం చేస్తున్నారు. మినరల్ వాటర్‌ప్లాంట్ పనిచేయకపోవడంతో తాగునీటి సమస్య తలెత్తింది. వీరితోపాటు అమడాల, సౌదరదిన్నె గ్రామాల ప్రజలు, పొలాలకు వెళ్లే రైతులు, కూలీలు ప్లాంట్ ద్వారా తాగునీటిని పట్టుకుని పొలాలకు వెళ్లి దాహార్తి తీర్చుకుంటున్నారు. విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.